సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 4 । డిసెంబర్ । 2024

రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడిగా ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు చోటు దక్కింది. సీఎం రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ వైస్‌చైర్మన్‌గా ఉన్న కమిటీలో ఎమ్మెల్యే బొజ్జును సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో మరో ముగ్గురు ఎమ్మెల్యేలను సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ మూడేళ్ల పాటు కొనసాగుతుంది.

సమస్యలు పరిష్కరించాలి

కైలాస్‌నగర్: ఏజెన్సీ పరిధిలో గిరిజనులు, గిరి జనేతరులు సాగు చేసుకుంటున్న భూములకు రుణమాఫీ, రైతుబంధు వర్తింపజేయాలని జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షాను మంగళవారం కలెక్టరేట్‌లో కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఇందులో భరత్ చౌహాన్, శంకరయ్య, సత్తయ్య, నరహరి, రాజన్న తదితరులున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/22.0

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



దివ్యాంగులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో వికలాంగులశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఇందులో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్య, ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీఈవో ప్రణీత, డీఆర్డీవో సాయన్న, ఏసీడీపీ మిల్కా, దివ్యాంగులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల త్యాగాలతోనే తెలంగాణ



శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేస్తూ..

ఆదిలాబాద్: బడుగు, బలహీన వర్గాల త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్ర కల సాకారం అయిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. తెలంగాణ మలిదశ తొలి అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి కార్యక్రమం జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీకాంతాచారి వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, శ్రీనివాస్, నర్సింగ్, కిష్టయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు దుకాణాలు తొలగించాలి

కైలాస్‌నగర్: విద్యాసంస్థలకు వంద గజాల పరిధిలో ఉన్న పొగాకు ఉత్పత్తుల దుకాణాలను తొలగించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. యెల్లో లైన్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం, టీబీపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాసంస్థల్లో పొగాకు ఉత్పత్తులు వినియోగించకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కార్మికశాఖ కమిషనర్‌కు సూచించారు. అనంతరం టీబీపై సమీక్షించి జిల్లా కేంద్రంలోని ఇద్దరు వ్యాధిగ్రస్తులకు కిరాణ సరుకులు అందజేశారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మలేరియా అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి

ఆదిలాబాద్: విద్యార్థులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని డీఐఈవో రవీందర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సీఆర్టీ పోస్టుల భర్తీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఆయా కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఈవో ప్రణీత తెలిపారు. 2023లో నిర్వహించిన రాత పరీక్ష ఆధారంగా 1:3 పద్ధతిన బుధవారం డీఈవో కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారి జాబితాను సాయంత్రం విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 5న కౌన్సెలింగ్ ఉంటుదని తెలిపారు. యూఆర్‌ఎస్‌లో సీఆర్టీ తెలుగు, సైన్స్, కేజీబీవీలో తెలుగు 1, ఫిజికల్ సైన్స్ 1, బయోసైన్స్ 2, సాంఘిక శాస్త్రం 2 మొత్తం 8 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వివరించారు.

పనితీరు చూస్తున్నారు..

- ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను • ఏడాదిలో చేపట్టిన పనులు సంతృప్తికరం
- రాజకీయ బేషజాలకు పోను.. • సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తా
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాక్షి, ఆదిలాబాద్: 'ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను.. ఇప్పటికే నా పనితీరును జనం గమనిస్తున్నారు.. ఈ ఏడాదిలో చేపట్టిన పనులు సంతృప్తినిచ్చాయి.. ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి ప్రజల కళ్ల ముందు ఉంటుంది.. బీజేపీ ఎమ్మెల్యే అయినప్పటికీ అధికార పార్టీతో రాజకీయంగా బేషజాలకు పోయేదిలేదు.. సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతాను..' అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మీ లక్ష్యాలు ఏమిటి..?

ఎమ్మెల్యే: ఎమ్మెల్యేగా గెలిచాక ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా లక్ష్యాలను నిర్దేశించుకున్నా. పెండింగ్‌లో ఉన్న ఎయిర్‌పోర్టు లేనిపక్షంలో ఎయిర్‌ఫోర్స్ సాధించడం, అసంపూర్తిగా ఉన్న కొరటా–చనాఖా, సాత్నాల ప్రాజెక్టులు పూర్తి చేయడం, ఆదిలాబాద్ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చడం, రిమ్స్‌లో వైద్యసేవలు మెరుగుపరచడం, భోరజ్ నుంచి మహారాష్ట్ర వరకు జాతీయ రహదారి అభివృద్ధి, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నియోజకవర్గంలో ఎక్కువ మంది పేదలకు ఇళ్లు నిర్మించాలనేదే నా ప్రధాన లక్ష్యాలు.

సాక్షి: ఎమ్మెల్యేగా ఏడాదిలో ఏం సాధించారు..?

ఎమ్మెల్యే: శాసనసభ్యుడిగా ఏడాది కాలంలో చేపట్టిన పనులు నాకు సంతృప్తినిచ్చాయి. ఎయిర్‌పోర్టు లేనిపక్షంలో ఎయిర్‌ఫోర్స్‌కు సంబంధించి ప్రాథమిక అనుమతులు సాధించగలిగాం. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రాంమోహన్‌నాయుడు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు విషయంలో పాజిటీవ్‌గా స్పందించారు. పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. వెనుకబడిన ఈ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుకూలంగా ఉంటుందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా దీనికి అనుకూలత వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులు సాత్నాల, కొరటా–చనాఖా విషయంపై అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. బడ్జెట్‌లో వీటికి సంబంధించి రూ.240 కోట్లు పెట్టారు. ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధి కోసం రూ.50 కోట్లతో ప్రతిపాదనలు అందిస్తే ఇప్పటి వరకు రూ.12 కోట్లు మంజూరు చేశారు. రోడ్లు, మురుగు కాలువలకు సంబంధించిన ఆ పనులు టెండర్ దశలో ఉన్నాయి. రిమ్స్‌లో 90 శాతం ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయడంలో దోహద పడ్డాను. ప్రస్తుతం 30 శాతం మాత్రమే ఖాళీ ఉన్నాయి. ప్రధానమంత్రి అమృత్ పథకంలో ఆదిలాబాద్ పట్టణానికి రూ.329 కోట్లు కేటాయింపులో ప్రత్యేక చొరవ చూపాను. ఈ నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, మంచినీటి సౌకర్యాలు మెరుగుపరచనున్నాం. ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభించాం. సీఆర్‌ఆర్ ఫండ్స్ రూ.10.5 కోట్లతో జైనథ్, ఆదిలాబాద్ మండలాల్లో రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు మంజూరు తీసుకొచ్చా. ఆ పనులు నడుస్తున్నాయి.

సాక్షి: భోరజ్ నుంచి మహారాష్ట్ర వరకు రోడ్డు నిర్మాణంలో జాప్యం అవుతుందన్న విమర్శలున్నాయి. దీనిపై మీ స్పందన.?

ఎమ్మెల్యే: వచ్చే జూన్ వరకు పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఈ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే జైనథ్, బేల మండలాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

సాక్షి: రైల్వే బ్రిడ్జిల పనుల్లో పురోగతి కనిపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీనిపై మీ స్పందన..?

ఎమ్మెల్యే: ఆదిలాబాద్‌లో ఆర్‌వోబీ, ఆర్‌యూబీలను 2017లో మంజూరు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించని కారణంగా ఈ పనులు మధ్యంతరంగా ఆగాయి. ఆ వాటాను కూడా కేంద్రం నుంచి తెచ్చి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నా. నిలిచిన పనులను ఇటీవల ప్రారంభించడం జరిగింది.

సాక్షి: అధికార కాంగ్రెస్‌పై ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఏడాది పాలనపై మీ అభిప్రాయం..?

ఎమ్మెల్యే: రైతు రుణమాఫీ, రైతుబంధు విషయంలో ఈ ప్రభుత్వం సక్సెస్ కాలేదు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట అధికార పార్టీ వివక్ష చూపడం సహజమే. అయితే ప్రతీ విషయంలో రాజకీయాలు చేయడం నాకు ఇష్టం ఉండదు. నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ఈ నాలుగేళ్లలో పరిష్కరించడమే నా ముందు ఉన్న లక్ష్యం.

సాక్షి: కొరటా–చనాఖా సాగునీటి ప్రాజెక్ట్ నిర్మాణం ఇప్పట్లో పూర్తవుతుందా.?

ఎమ్మెల్యే: కొరటా–చనాఖా బ్యారేజ్‌తో పాటు స్థానికాల ఆయకట్టు అభివృద్ధికి సంబంధించి అసంపూర్తి పనుల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. భూ సేకరణకు నిధులు విడుదల చేశారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా 60వేల నుంచి 70వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం.

సాక్షి: సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణకు నోచుకుంటుందా.. ప్రైవేట్ ఫ్యాక్టరీ ఏర్పాటవుతుందా.?

ఎమ్మెల్యే: నియోజకవర్గంలో ఉపాధి కల్పనకు సిమెంట్ పరిశ్రమ దోహద పడుతుంది. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నా. సీసీఐ గత 30 ఏళ్లుగా మూతపబడి ఉంది. యాపల్‌గూడలో ప్రైవేట్ సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి స్టేజ్–2 ప్రక్రియ మొదలైంది. స్టేజ్–3 పూర్తయితే పనులు ప్రారంభమవుతాయి. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి దీనిపై వివరించాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ కమిటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నా.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి



అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా లంచం అడిగితే తమకు సమాచారం అందించాలని ఏసీబీ సీఐలు కిరణ్ కుమార్, స్వామి పేర్కొన్నారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షిషా సమక్షంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఈనెల 9 వరకు అవినీతి వ్యతిరేక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు, అలాగే 5,6 తేదీల్లో విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులతో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 7న విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 106, డీఎస్పీ నంబర్ 91543 88963, సీఐలు 91543 88964, 91543 88965 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈఏడాది నవంబర్ వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 13 కేసుల నమోదు, తనిఖీలు చేసినట్లు తెలిపారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాపల్‌గూడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యూట్రిషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు ముట్టుకోమని, అందరికీ అవగాహన కల్పిస్తామని విద్యార్థులు కలెక్టర్ సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలలో ప్రతిరోజు ఉదయం ప్రార్థన అనంతరం పది నిమిషాలపాటు విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. పోషకాహారం ఆవశ్యకత, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలు అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, డీఎంహెచ్‌వో నరేందర్, ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుది దశకు డేటా ఎంట్రీ

- మావల మండలంలో వందశాతం పూర్తి
- జిల్లావ్యాప్తంగా 81.69శాతం నమోదు

జిల్లాలోని కుటుంబాలు : 2,21,578
డేటా ఎంట్రీ ఆపరేటర్లు: 412
ఇప్పటి వరకు నమోదు పూర్తి చేసిన కుటుంబాలు: 1,81,008

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియ జిల్లాలో తుది దశకు చేరింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కలిపి 81.69 శాతం కుటుంబాల వివరాలను ఆపరేటర్లు సమగ్ర సర్వే వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. మావల మండలంలో వందశాతం పూర్తి కాగా పలు మండలాల్లో 75 నుంచి 96శాతం నమోదు చేశారు. బుధవారం నాటికి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వందశాతం పూర్తిచేసేందుకు అధికారులు దృష్టి సారించారు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండటంతో గడువులోపు పూర్తవడం కష్టతరంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు మున్సిపల్ పరిధిలో కేవలం 66.40శాతం వివరాలు మాత్రమే నమోదు చేశారు.

జిల్లాలో ఇలా..

జిల్లావ్యాప్తంగా ఎన్యుమరేటర్లు సేకరించిన కుటుంబాల సమాచారాన్ని సమగ్రకుటుంబ సర్వే వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేకంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఎంపిక చేశారు. జిల్లాలోని ఆయా శాఖల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లను డీఈవోలుగా ఎంపిక చేసిన యంత్రాంగం వారికి జెడ్పీ కార్యాలయంలో గతనెల 21న ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారి పేరిట యూజర్ ఐడీలను క్రియేట్ చేశారు. ఈ మేరకు ఆపరేటర్లు గత నెల 22 నుంచి ప్రక్రియ ప్రారంభించారు. మండలాల వారీగా ఎంపిక చేసిన కేంద్రాల్లో నమోదు చేస్తున్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 16,281 ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేయగా ఇప్పటి వరకు మొత్తం ఈ సంఖ్య 1,81,008కి చేరింది. పలు మండలాల్లో 75 నుంచి 96 శాతం ప్రక్రియ పూర్తయినందున బుధవారం నాటికి వందశాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే మున్సిపల్‌లో వివరాల నమోదు నెమ్మదిగా సాగుతుండటంతో ప్రక్రియ కొంత ఆలస్యమయ్యే అవకాశముంది.

మండలాల వారీగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయిన కుటుంబాల వివరాలు..

మండలం	నమోదు పూర్తయినవి	శాతం			
			బోథ్	9,268	84.98
మావల	1,756	100	బేల	8,293	83.89
ఆదిలాబాద్‌రూరల్	11,215	96.89	సాత్నాల	3,587	83.69
జైనథ్	8,042	96.31	ఉట్నూర్	15,719	82.91
భీంపూర్	7,231	92.94	సొనాల	3,217	80.79
బజార్‌హత్నూర్	8,829	92.40	గాదిగూడ	5,435	80.54
సిరికొండ	5,019	91.99	గుడిహత్నూర్	8,106	80.38
భోరజ్	5,719	89.94	ఇచ్చోడ	10,912	78.76
నేరడిగొండ	8,088	87.58	తలమడుగు	8,869	76.47
ఇంద్రవెల్లి	10,561	87.01	నార్నూర్	7,059	75.90
తాంసి	4,605	85.63	ఆదిలాబాద్‌అర్బన్	29,478	66.40

అట్టహాసంగా ప్రజాపాలన విజయోత్సవాలు

కైలాస్‌నగర్: ప్రజాపాలన విజయోత్సవాలను ఆదిలాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ రకాల వంటల స్టాళ్లను పరిశీలించి వంటకాలను రుచి చూశారు. పారిశుధ్య కార్మికులను శాలువాతో సత్కరించి అభినందించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, వీధి వ్యాపారులకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.3.62కోట్ల విలువైన చెక్కు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ తిరుపతి, మెప్మా డీఎంసీ శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీనివాస్, సతీష్,లక్ష్మణ్, అధికారులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్

'మైత్రి'తో భరోసా





జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్

- రిమ్స్‌లో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్యం
- త్వరలో అందుబాటులోకి సేవలు

ఆదిలాబాద్‌టౌన్: సమాజంలో ట్రాన్స్‌జెండర్లు అంటే చాలా మందికి చిన్నచూపు ఉంటుంది. వారిపై వివక్షతో పాటు విసుగు ప్రదర్శిస్తారు. శరీరంలో హార్మోన్ల హెచ్చుతగ్గులతో పలువురు థర్డ్‌జెండర్‌గా మారిపోతుండగా, కుటుంబ సభ్యుల తోడ్పాటు కూడా కరువై ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. కనీసం ఆస్పత్రికి సైతం వెళ్లలేని పరిస్థితి. వారి ఆవేదనను గుర్తించిన ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల కోసం వారంలో రెండు రోజుల పాటు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు మైత్రి జెండర్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఈ సేవలను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో సోమవారం ప్రారంభించారు. అయితే ఈనెల 6న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభించనున్నట్లు సమాచారం.

రిమ్స్‌లో ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు..

రిమ్స్‌లో ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్‌లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రతీ మంగళ, గురువారాల్లో వైద్య సేవలు అందనున్నాయి. నోడల్ అధికారిగా ఫిజీషియన్ హెచ్‌వోడీ క్లాం వెంకట్‌రెడ్డి వ్యవహరించనుండగా.. ప్రత్యేకంగా డెర్మటాలజీ, ప్లాస్టిక్ సర్జన్‌తో పాటు మానసిక వైద్యనిపుణులు అందుబాటులో ఉండనున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా ట్రాన్స్‌జెండర్స్ ఇక్కడ వైద్యసేవలు పొందవచ్చు. ఆరోగ్యేతర సేవలు సైతం అందనున్నాయి. లింగాధారిత సేవలు, సాధారణ ఆరోగ్య సేవలు, లైంగికంగా సంక్రమించే వ్యాధులకు చికిత్స, సామాజిక అర్హత సేవలు, ల్యాబ్ ద్వారా వైద్య పరీక్షలు సైతం చేయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వీరికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

జిల్లాలో 60 మంది వరకు..

జిల్లాలో 60 మంది వరకు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. చాలా మందికి ఆరోగ్యంపై అవగాహన లేక మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆస్పత్రికి వెళితే ఎవరైనా సూటిపోటి మాటలతో హేళన చేస్తారని వైద్యం చేయించుకోకుండా అవస్థలు పడుతున్నారు. హార్మోన్ల ప్రభావంతో పలువురు పురుషులు ట్రాన్స్‌జెండర్‌గా మారుతున్నారు. వీరు బెంగళూర్, చెన్నై, ఢిల్లీ, పుదుచ్చేరి, ముంబాయి తదితర ప్రాంతాల్లో శస్త్ర చికిత్స చేయించుకుంటున్నారు. ఆ తర్వాత వీరికి ఉపాధి కరువవుతుండడంతో శుభకార్యాలతో పాటు రోడ్లపై భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబీకుల నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చి ఎక్కడో ఒక చోట జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను అన్నివిధాలా ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా, మైత్రి క్లినిక్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..



ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి క్లినిక్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. వారానికి రెండు సార్లు వైద్య సేవలు అందిస్తామని చెబుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని మా సంఘం సభ్యులు హైదరాబాద్‌లో కలిసి మా కోసం ప్రత్యేకంగా క్లినిక్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటాం. నేను డిగ్రీ వరకు చదువుకున్నప్పటికీ ఎలాంటి ఉపాధి పొందలేకపోతున్నాను. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– పూరి, ట్రాన్స్‌జెండర్, ఉట్నూర్

హేళన చేస్తారనే..



సమాజంలో ట్రాన్స్‌జెండర్ అంటే చాలా మందికి చిన్న చూపు. దీంతో మేము మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నాం. హార్మోన్ల ప్రభావంతోనే నేను ఇలా మారాను. కుటుంబీకులు, సమాజం నుంచి చీదరింపులకు గురికావాల్సి వస్తుంది. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆస్పత్రికి వెళ్లి సమస్యలు చెప్పుకోలేని పరిస్థితి ఉంది. మాకు ఎవరు ఉపాధి కాని, అద్దెకు ఇళ్లుకాని ఇవ్వడానికి ముందుకు రారు. చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. నేను ఇంటర్ వరకు చదువుకున్నా. ప్రభుత్వం మాకు రేషన్ కార్డు, పింఛన్, రుణాలు అందించేలా చూడాలి.

– చిట్టి, ట్రాన్స్‌జెండర్, ఇంద్రవెల్లి

వారంలో రెండు రోజుల పాటు సేవలు



ట్రాన్స్‌జెండర్ కోసం రిమ్స్‌లో ప్రత్యేకంగా మైత్రి జెండర్ క్లినిక్ ఏర్పాటు చేశాం. జనరల్ ఫిజీషియన్, డెర్మటాలజిస్టు, సైకియాట్రిస్ట్, ప్లాస్టిక్ సర్జరి వైద్యులను ప్రత్యేకంగా నియమించాం. వారంలో రెండు రోజుల పాటు వీరికి ప్రత్యేకంగా వైద్య సేవలు అందించడం జరుగుతుంది. కౌన్సెలింగ్ సైతం నిర్వహిస్తాం. ఆస్పత్రికి వచ్చినప్పుడు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తాం. ట్రాన్స్‌జెండర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

ఉద్యోగులపై ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ

- ఆర్‌ఎం సోలోమన్

ఆదిలాబాద్: ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపేలా నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగులపై సంస్థ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ డిపోలో ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం వనభోజనాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా క్రీడా పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఇది రెండు రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం(ఎం) ప్రవీణ్ కుమార్, డిప్యూటీ ఆర్‌ఎం(వో) ఎస్.ప్రణీత్, ఏవో శంకరయ్య, పీవో జీబ్లా, డిపో మేనేజర్ కల్పన, ఎం.ఎఫ్ శ్రీకర్, ఎంఎఫ్ రాజేందర్, ఆర్‌ఎం ఆఫీస్ సూపరింటెండెంట్ శివ దాస్, డీఎం ఆఫీస్ సూపరింటెండెంట్ పోతారెడ్డి, రిజర్వేషన్ ఇన్‌చార్జి సయీద్ అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎం సోలోమన్

క్లుప్తంగా

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

పాతమంచిర్యాల: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద ఆరోగ్య, ఆరోగ్యేతర రంగాలలో విదేశాల్లో పనిచేసేందుకు అర్హత గల వారికి శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9440051452, 9951909863 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు. ఈ నెల 2, 3 తేదీల్లో హన్మకొండలో నిర్వహించిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 17 బాలికల బాక్సింగ్ పోటీల్లో 3 పతకాలతో మెరిశారు. 46–48 కేజీల విభాగంలో టీ.నిహారిక స్వర్ణ పతకం, 40–42 కేజీల విభాగంలో వివేకవర్ధిని రజత పతకం, 40–44 కేజీల విభాగంలో అనూష కాంస్య పతకం సాధించినట్లు బాక్సింగ్ కోచ్ సాయి తెలిపారు. నిహారిక ఈ నెల 7నుంచి 12 వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

7 నుంచి డీఎడ్ వెబ్ ఆప్షన్లు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో డీఎడ్‌లో ర్యాంక్‌లు సాధించిన అభ్యర్థులు రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యతను ఎంచుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 9 వరకు వెబ్ ఆప్షన్లు, 13న సీట్ల కేటాయింపు, 13 నుంచి 15 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయడం, 18న స్లైడింగ్, 21 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇదివరకు సర్టిఫికెట్లను పరిశీలించని అభ్యర్థులు 5న సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో 42మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర కోర్సుల్లో మంగళవారం నిర్వహించిన మొదటి, ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 42 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. వరంగల్ జిల్లాలో ఒకరు, ఆదిలాబాద్‌లో 35 మంది, ఖమ్మం జిల్లాలో ఆరుగురు డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు.

దూడను హతమార్చిన పులి?

ఇంద్రవెల్లి: మండలంలోని గట్టెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ రైతుకు చెందిన దూడపై పులి దాడిచేసి హతమార్చినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మెస్రం బాదిరావ్‌కు చెందిన దూడ ఐదు రోజుల క్రితం అటవీప్రాంతానికి మేతకు వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం అటవీ ప్రాంతంలో గాలించగా ఆలికోరి అటవి ప్రాంతంలో దూడ కళేబరం గుర్తించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని దూడ కళేబరాన్ని, పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. పులి సంచరించినట్లు ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని ఎఫ్ఆర్‌వో సంతోష్ తెలిపారు.

బాల శాస్త్రవేత్తలు భళా..!

- ఇన్‌స్పైర్‌లో విద్యార్థుల ప్రతిభ
- 15 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లోని సృజనాత్మకత, ఆలోచనాశక్తిని వెలికితీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా నవంబర్ 30, డిసెంబర్ 1న జిల్లాస్థాయిలో వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లాకు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన 149 ప్రాజెక్టులను ప్రదర్శించగా 15 రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులపై 'సాక్షి' కథనం..



జిల్లా కేంద్రంలో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సురక్షిత కొడవలి..



సురక్షిత కొడవలితో గడ్డి కోస్తున్నప్పుడు సేఫ్టీ సికిల్ స్విచ్ ఆన్‌చేస్తే పాములు రైతు వైపునకు రాకుండా దూరంగా వెళ్లిపోతాయి. టార్చిలైట్ ఆన్‌లో ఉండడం వలన చీకట్లో కూడా రైతులు సురక్షితంగా గడ్డి కోయవచ్చు. ఈ కొడవలి హ్యాండిల్‌లో ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా ఉంటుంది. ఫస్ట్ ఎయిడ్ మెడిసిన్ పొందటానికి సేఫ్టీ సికిల్ చివర క్యాప్ తెరిస్తే కాటన్, ట్యాబ్లెట్లు కనిపిస్తాయి.

– నందం శరణ్య, జెడ్పీహెచ్ఎస్, ఇంక్లైన్–2, బెల్లంపల్లి

ఆల్టర్‌నేట్ ప్రాజెక్టు వాటర్ డ్రైనింగ్ సిస్టమ్



ఒక్కోసారి ప్రాజెక్టు నీటిమట్టం ప్రమాదకరస్థాయిని చేరుకుంటుంది. ఆనీటిని విడుదల చేసేందుకు గేట్లు ఎత్తుతారు. కొన్నిసార్లు అనుకోని పరిస్థితుల్లో గేట్లు జామ్ అయ్యి ఎత్తలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో నీటిని ఏదో విధంగా తోడివేయడం తప్పనిసరి. లేదంటే లోతట్టు ప్రాంత ప్రజల ప్రాణాలు, ఆస్తులకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. ప్రాణనష్టం, ఆస్తినష్టం నివారించాలనే ఆలోచనతో ఆల్టర్‌నేట్ ప్రాజెక్టు వాటర్ డ్రైనింగ్ సిస్టమ్ రూపొందించారు.

– సాయితేజ, జెడ్పీఎస్ఎస్ జన్నారం

మెట్రో అంబులెన్స్‌తో..



మెట్రో నగరాల్లో ట్రాఫిక్ సమస్య వల్ల అంబులెన్స్ సరైన సమయంలో ఆస్పత్రికి చేరుకోలేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు మెట్రో అంబులెన్స్ సర్వీసు ప్రాజెక్టు తయారు చేశాడు. ఈ సర్వీసు మెట్రోలైన్ ఫిల్లర్స్‌ను ఉపయోగించుకుని ఒక ఫిల్లరు నుంచి మరో ఫిల్లర్‌కు రోప్‌వే ద్వారా అనుసంధానించబడుతుంది. ఒక ప్రదేశంలో ఉన్న మెట్రో ఫిల్లర్ పైకి లిఫ్ట్‌సాయంతో ప్రమాదానికి గురైన వ్యక్తిని పంపించి అక్కడి నుంచి రోప్‌వేకి కనెక్ట్ చేయబడిన మెట్రో అంబులెన్స్ ద్వారా మరో ప్రదేశానికి సులువుగా తరలించి మరో లిఫ్ట్ ద్వారా అంబులెన్స్ లేదా సమీపంలోని ఆస్పత్రికి చేర్చడం ప్రాజెక్టు ఉద్దేశం.

– ఇంద్రవర్మ, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్, గుడిపేట్

గాలి నుంచి విద్యుత్ ఉత్పత్తి..



గాలినుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రాజెక్టు ముఖ్యఉద్దేశం. ఈపద్ధతిలో పూర్తిగా పర్యావరణ హిత పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. ఇందులో బొగ్గు, పెట్రోలియం వంటి వాటిని కాకుండా కేవలం వాహనాల చలనం వల్ల వచ్చే గాలి వేగంను ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేయడం లక్ష్యం. ఒక పరికరం ద్వారా సుమారు ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు అరవై నుంచి వంద వాట్స్ కరెంట్ ఉత్పత్తి చేయవచ్చు.

– ఆరాధ్య, టీఎస్ఎంఎస్, మంచిర్యాల

ఆటోమెటిక్ టాయిలెట్ క్లీనింగ్ సిస్టం



పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ ఇలా జనసాంద్రత ఎక్కువగా ఉండేచోట టాయిలెట్లు వాటర్ పోయకుండా వెళ్లడం వలన అపరిశుభ్రంగా ఉంటాయి. ఇలాంటి సమస్యలను నివారించేందుకు ఆటోమెటిక్ ఆఫ్షేటెడ్ టాయిలెట్ క్లీనింగ్ సిస్టం రూపొందించారు. డోర్ తెరవగానే ట్యాంక్‌నుంచి నీటిసరఫరా జరిగి టాయిలెట్ శుభ్రం అవుతుంది. ఇలా లోపలికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు డోర్లు ఓపెన్ కావడంతో రెండుసార్లు నీటితో శుభ్రం చేసేందుకు దోహదపడుతుంది.

– శ్రావణ్‌కుమార్, జెడ్పీహెచ్ఎస్ అన్నారం

ప్రమాదాల నివారణకు..



సాధారణంగా పార్కింగ్ చేసిన వాహనాల కింద జంతువులు పడుకోవడం, చిన్న పిల్లలు ఆడుకుంటూ ఉండటం గమనిస్తూ ఉంటాం. డ్రైవర్ వాహనం ముందుభ, వెనుక భాగం మాత్రమే చూసే వీలుంటుంది. కిందిభాగం చూడలేని పరిస్థితుల్లో ప్రమాదాలు సంభవిస్తాయి. వాహనం ముందు వైపు కింది భాగంలో ఒక చిన్న కెమెరా అమర్చి డ్రైవర్ ముందుభాగంలో ఉన్న స్క్రీన్‌కు లేదా స్మార్ట్ ఫోన్‌కు అనుసంధానం చేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు నివారించవచ్చు. డ్రైవర్ వాహనం స్విచ్ ఆన్ చేసిన వెంటనే స్క్రీన్‌పై వాహన కిందిభాగం కనిపిస్తుంది. కెమెరాకు ఉన్న చిన్న మోటర్ సాయంతో కెమెరాను రొటేట్ (వాహన 360 డిగ్రీల వ్యూయర్) చేసుకోవడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చు.

– రజనీకాంత్, జెడ్పీహెచ్ఎస్, వేమనపల్లి

హామీలు అమలు చేయాలి

శ్రీరాంపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ.శ్రీనివాస్ హెచ్ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు టీ.సారయ్య, సింగరేణి ఉద్యోగుల సంఘం కో కన్వీనర్ సమ్మ రాజయ్య మాట్లాడుతూ సింగరేణిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. బుధవారం ముఖ్యమంత్రి పెద్దపల్లి సభ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించామని, దీనిని అడ్డుకునేందుకు హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షుడు మేకల రాములు, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.బ్రహ్మానందం, ఏఐఎఫ్‌టీయూ నాయకులు పోచమల్లు, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని రైతుల ఆందోళన

తలమడుగు(బోథ్): రెండు లక్షలలోపు ఉన్నప్పటికీ రుణమాఫీ కాలేదని మంగళవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలోని బాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను కలిసినా సమస్య పరిష్కారం కావడంలేదన్నారు. బ్యాంకు మేనేజర్‌ను అడిగితే మేము సమాచారం పూర్తిగా పంపించామని సమాధానం ఇస్తున్నారన్నారు. ఎక్కడికి వెళ్లాలో తెలియడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రాథోడ్ షేకు, జాదవ్ మణిరాం, రాథోడ్ శివలాల్, చౌహాన్ పరశురాం, రఘుపతి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

పూలకోసం వెళ్లి.. శవమై

- చెరువులో నీటమునిగి వ్యక్తి మృతి

చెన్నూర్: పూలకోసం వెళ్లిన వ్యక్తి శవమైన వచ్చిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బట్టిగూడెం కాలనీకి చెందిన పందుల రమేశ్ (40), జిట్టవేన రాజబాపు మంగళవారం తామరపూలకోసం పెద్ద చెరువుకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగిన రమేశ్ కాలికి తామరచెట్టు వేర్లు చుట్టుకుని అడుగుభాగంలో ఇరుక్కుపోయాడు. గమనించిన రాజబాపు కేకలు వేయగా పలువురు ఈతగాళ్లు చెరువులోకి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుని భార్య సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



రమేశ్ (ఫైల్)

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

- రహదారిపై కుటుంబ సభ్యుల ఆందోళన

కోటపల్లి(చెన్నూర్): ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పానెం గంగయ్య, గంగమ్మ దంపతుల కుమారుడు సూర్యకిరణ్ (25) మంగళవారం ద్విచక్ర వాహనంపై పొలం పనులకు వెళ్తుండగా లక్ష్మీపూర్ సమీపంలో ఎదురుగా వచ్చిన ఎద్దును తప్పించే క్రమంలో సిరోంచ నుంచి చెన్నూర్ వైపు వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యులు మృతదేహంతో జాతీయ రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రాత్రివరకూ ఆందోళన విరమించలేదు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా నీల్వాయి ఎస్సై శ్యామ్‌పటేల్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



సూర్యకిరణ్ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

మెరుగైన విద్య, వైద్యం అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల డీటీడీవో, ఏటీడీవోలను ఆదేశించారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన పోషణ మిత్ర ద్వారా విద్యార్థులకు రక్తహీనత లేకుండా చూడాలన్నారు. అలగే మోవా లడ్డూ సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. స్నానానికి వేడి నీళ్లు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఏటీడీవోలకు సూచించారు. ఆశ్రమ పాఠశాలలను సందర్శించి భోజనం నాణ్యతను పరిశీలించాలన్నారు. సమావేశంలో ఏటీఎంహెచ్‌వో మనోహర్, డీటీడీవో రమాదేవి, ఉమ్మడి జిల్లాల ఏటీడీవోలు, జీసీడీవోలు, ఏసీఎంవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

నాణ్యమైన భోజనం అందించాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులను నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించి సబెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. అనంతరం ఉట్నూర్ మండలంలోని సుక్కతాండ, లంబాడీతండాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు.

ప్రేమ పేరుతో వంచించాడని..

- యువతి ఆత్మహత్య
- నిందితుడు బీఆర్ఎస్వీ నేత

బెల్లంపల్లిరూరల్: ప్రేమ పేరుతో వంచనకు గురైన యువతి బలవన్మరణం చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హనుమాన్ బస్తీకి చెందిన జంగపల్లి సాయిస్నేహిత(21), మహ్మద్‌ఖాసీం బస్తీకి చెందిన బీఆర్ఎస్వీ బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ఈదునూరి శ్రీనాథ్ కొంతకాలంగా ప్రేమించుకున్నారు. యువతి పెళ్లి ప్రస్తావన తీసుకరావడంతో కుటుంబసభ్యులు నిరాకరిస్తున్నారని చెప్పడంతో తీవ్ర వేదనకు గురైంది. సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకన్నారు. శ్రీనాథ్ మోసంచేశాడనే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నర్సయ్య తెలిపారు. కాగా సాయి స్నేహిత మృతిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు ఈదునూరి శ్రీనాథ్‌ను పదవి నుంచి తొలగించినట్లు బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ తెలిపారు.



సాయి స్నేహిత (ఫైల్)

ఎస్టీపీపీ జీఎం ఆత్మహత్య

జైపూర్: 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో నూతనంగా ఎఫ్‌జీడీ నిర్మాణం చేపడుతున్న పీఈఎస్ ఇంజనీరింగ్ సర్వీస్ కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ (జీఎం)గా విధులు నిర్వర్తిస్తున్న బొబ్బా తిరుపతిరావు (అలియాస్ బీటీరావు)(56) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాద్‌కు చెందిన తిరుపతిరావు రెండేళ్లుగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతుండగా ఆపరేషన్ సైతం చేయించుకున్నాడు. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు ఒంటరి జీవితం గడుపుతుండడంతో మనస్తాపానికి గురై మంగళవారం తాను నివాసం ఉంటున్న క్వార్టర్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య స్వప్న, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని సోదరుడు శ్రీనివాస్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. యువ ఇంజనీర్ కిరీటి ఆత్మహత్య మరువక ముందే మరో అధికారి ఆత్మహత్యకు పాల్పడడం స్థానికులలో ఆందోళన కలిగిస్తోంది.



తిరుపతిరావు(ఫైల్)

ప్రాజెక్టులో దూకి ఒకరు ..

ఆసిఫాబాద్‌రూరల్: కుమురం భీం ప్రాజెక్టులో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అడ గ్రామానికి చెందిన భీమయ్య (70) కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని కుమురం భీం ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతునికి భార్య రుక్మబాయి, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

మద్యం మత్తులో యువకుడు..

చింతలమానెపల్లి: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గూడెం గ్రామానికి చెందిన మండిగా సాయి (23) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మద్యం మత్తులో ఇంటి సమీపంలోని పెరట్లో చున్నీతో ఉరేసుకున్నాడు. మృతుని భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి

భీమారం: విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన పప్పు చంద్రమౌళి (53) భీమారంలోని ఐటీడీఏ కాలనీలో నివసిస్తున్న అతని అల్లుడు రాంటెంకి రంజిత్ కుమార్ ఇంటికి మూడు రోజుల క్రితం వచ్చాడు. మంగళవారం ఇటీవల నిర్మించిన భవనంపైకి 20 ఫీట్ల ఇనుపరాడ్ తీసుకెళ్తుండగా పైన ఉన్న 11కేవీ విద్యుత్ తీగలకు రాడ్ తగలడంతో షాక్‌కు గురయ్యాడు. అతనికి సహాయం చేస్తున్న పక్కింటికి చెందిన బాలుడు వంశీకృష్ణకు గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చంద్రమౌళి మృతి చెందాడు. రంజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.



చంద్రమౌళి (ఫైల్)